ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
ఆదివారం 2 నవంబరు 2025
5★★



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెట్‌పల్లి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడిపల్లి గ్రామంలోని 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి లోని గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారలు శనివారం తెలిపారు. మండలంలోని మేడిపల్లి, బండ లింగాపూర్, రాజేశ్వర్‌రావుపేట, చెర్లకొండ పూర్, సత్తక్కపల్లి, ఎర్రాపూర్, అమ్మకపేట, డబ్బా గ్రామాల్లో విద్యుత్ మరమతులు, చెట్ల కొమ్మలు కొట్టడం వలన ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంత రాయం ఉంటుందన్నారు. వినియోగదారులు, వ్యాపారస్థులు, రైతులు సహకరించాలన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలో కొత్తగా నిర్మాణం చేసే విద్యుత్ సబ్‌స్టేషన్ మర మ్మతు పనుల కోసం ఈ నెల 2న ఆదివా రం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అం తరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మ పురి, కమలాపూర్, నాగారం, బురు దేశిపల్లె, నర్సయ్యపల్లె, కోరండ్లపల్లె గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగు తుందని పేర్కొ న్నారు.

జిల్లాలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

జగిత్యాల టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) :జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉం చుకుని నవంబరు 1 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉం టుందని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలో పోలీస్ అధికారుల అనుమతి లేకుం డా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరస నలు, ర్యాలీలు, పబ్లిక్‌మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ సూచించారు. ఈ విషయంలో జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసు లకు అన్ని వర్గాల ప్రజలు సహకారాం అందిం చాలని సూచించారు.

ఉపాధిహామీ గ్రామ సభలు

కొడిమ్యాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్, శనివారంపేట గ్రామాలలో శనివారం ఈజీఎస్ అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. ఉపాధి హామీ పనుల్లో అభివృద్ధి పనులను ఎంపికపై గ్రామస్థులతో చర్చించారు. నీటి సంరక్షణ పనుల, పండ్ల తోటల పెంపకం పనుల గు రించి గ్రామస్థులతో చర్చించారు. ఈ గ్రామ సభలలో ఏపీవో సతీష్, హౌజింగ్ ఏఈ సింధు, ఆయా గ్రామ పంచాయతీల కార్య దర్శులు జ్యోతి, మధు, టీఏ గౌతమి, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

మల్లాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో వర్షాలకు, గాలులకు వరి మొక్కజొన్న పంటలను నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుట్ల నియోజక వర్గం టీడీపీ నాయకులు మానుక ప్రవీణ్ డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ నాయకులతో కలిసి మల్లాపూర్ మండలం లోని గొర్రెపల్లి, వేంపల్లి వెంకట్రావుపేట గ్రామాల్లో పర్యటించి పంటలను నష్ట పోయి న బాధిత రైతులను పరామర్శించారు. దెబ్బ తిన్న పంటలను పరిశీలించినారు. అధికార యంత్రాంగం స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు.

సాదాబైనామాలకు మోక్షం



● తొలగిన న్యాయపరమైన చిక్కులు
● పరిష్కారానికి ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
● బీఆర్ఎస్ హయాంలో దరఖాస్తుల స్వీకరణ
● జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో 35,010 దరఖాస్తులు

జగిత్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూముల క్రయ విక్రయాలకు సంబంధించి సాదాబైనామాల క్రమబద్ధీకరణకు న్యాయపరమైన చిక్కులు తొలగి పోయాయి. దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభు త్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రైతు ల ఏళ్ల నాటి నిరీక్షణకు తెరపడింది. కాంగ్రెస్ సర్కారు ధరణి స్థానంలో భూ భారతి కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడంతో పాటు రెవెన్యూ చట్టం 2024ను ప్రతి పాదించింది. ఈ చట్టంలో సాదా బైనామాలకు చట్ట బద్ధత కల్పించే అంశం చేర్చడంతో గతంలో దర ఖాస్తు చేసుకున్న వారికి ప్రయోజనం కలగనుంది.

అత్యధికంగా మెట్‌పల్లిలో 4,489 దరఖాస్తులు పెండింగ్..

జిల్లా వ్యాప్తంగా 35,010 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా మెట్‌పల్లిలో 4,489 దరఖాస్తులు, అత్యల్పంగా జగిత్యాలలో 318 దర ఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గొల్లపల్లిలో 1,000 దరఖాస్తులు, సారంగపూర్ 934, ఇబ్రహీంపట్నం 1,903, బుగ్గారం 984, పెగడపల్లి 1,840, వెల్గటూరు 2,809, మల్లాపూర్ 3,025, కథలాపూర్ 2,757, రాయి కల్ 3,104,కొడిమ్యాల 837, జగిత్యాల రూరల్ 1,901, మేడిపల్లి 1,336, బీర్‌పూర్ 1,757, మల్యాల 737, ధర్మ పురిలో 2,119 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

బాండ్ పేపర్లపైనే..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎక్కువగా తెల్ల కాగి తాలు, బాండ్ పేపర్ల పైనే భూ క్రయవిక్రయాలకు చెందిన అగ్రిమెంట్లు ఉన్నాయి. సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన వారు మోకాపై ఉండడం, అమ్మిన వారి పేర్లు పట్టాదారు పాస్‌బుక్‌లలో రావడంతో సదరు భూములు తమవేనంటూ గొడవలు జరుగు తున్నాయి. దీంతో ప్రభుత్వం సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన వారికి 2016 సంవత్సరంలో దర ఖాస్తుకు అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం వాటిని పరిష్కరించిన తర్వాతే కొత్త దరఖాస్తులు స్వీక రించనున్నట్లు రెవెన్యూ అధికారులు అంటున్నారు.

2020కి ముందు దరఖాస్తులకు పరిష్కారం

2020 సంవత్సరంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రక టించింది. 2020 అక్టోబర్‌లో ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఆ యేడాది అక్టోబర్ 12వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు సాదాబైనా మాల క్రమ బద్ధీకరణకు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. అయితే కొందరు వ్యక్తులు

మిగతా 8లో

సాదా బైనామాలకు పట్టాలు హర్షణీయం
గాజెంగి నందయ్య, కాంగ్రెస్ నాయకుడు



సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించడం మంచి నిర్ణయమే. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినప్పటికీ రేవంత్‌రెడ్డి సర్కారు రైతుల ప్రధాన సమస్యకు పరిష్కారం చూపనుంది. ఎంతో మందికి సాదాబైనామాలకు పట్టాలు జారీ చేసే అవకాశం లభించనుంది.

రైతులకు ప్రయోజనం కలగనుంది
అల్లూరి మహేందర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్



సాదా బైనామాలకు పట్టాలను జారీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు రుణ పడి ఉంటారు. సాదాబైనామాలకు పట్టాల జారీ కోసం ఐదు సంవత్సరాలుగా ఎంతో మంది ఎదురుచూస్తు న్నారు. వారందరికీ తొందరలోనే పట్టాలు జారీ అయ్యే అవకాశం కలిగింది.

ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు

జగిత్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ఇతర సంబంధిత అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్‌డీఓలు మధుసుదన్, శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



టీకాలను పరిశీలిస్తున్న జిల్లా పశు వైద్యాధికారి ప్రకాష్

రాయికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి బి.ప్రకాష్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో జరిగిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను శనివారం వారు పరిశీలించారు. మూడు నెలలు పైబడిన అన్ని పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయంచాలని సూచించారు. ఈ సందర్భంగా 220 పశువులకు టీకాలు వేసినట్లు అదనపు పశు వైద్యుడు నరేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎలిగేటి రవీందర్, నాగేందర్ రెడ్డి, శివ కుమార్, కార్యాలయ సహాయకులు షేక్ అహ్మద్, పోచయ్య, రైతులు రాజేష్, ప్రవీణ్, కొప్పెల గంగారాం, గణేష్, చెల్కల భీమన్న తదితరులు పాల్గొన్నారు.

●**జగిత్యాలరూరల్:** పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఇప్పించాలని జగిత్యాల జిల్లా వెటర్నరీ అసిస్టెంట్‌డైరెక్టర్ నరేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వాసుపావని, లైవ్‌స్టాక్ అధికారి పూర్ణచందర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు విశాల్, నరేష్, జ్యోతి, సిబ్బంది రాజు, అనిత, గంగయ్య, రాములు, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

మెట్‌పల్లి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను ప్రభావంతో మండలంలోని చౌలమద్ది, వెల్లుల్ల, కొండ్రికర్ల, కోనరావుపేట, వెంకట్రావుపేట, ఆరపేట గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి దీపిక, ఏఈవోలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నేల వాలిన వరి పంటలను పరిశీలించి జిల్లా స్థాయి అధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు నరేష్, మమత, మనోజ్ఞా, అనిల్, భూమేశ్వర్ పాల్గొన్నారు.

డీపీవోను కలిసిన ఈ పంచాయతీ ఆపరేటర్లు

జగిత్యాల అర్బన్, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలయిన గ్రూప్ 1 నియామకాల ద్వారా జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారిగా నియమితులై బాధ్యతలు చేపట్టిన రేవంత్‌ను జిల్లా ఈ పంచాయతీ ఆపరేటర్‌లు శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈ పంచాయతీ ఆపరేటర్‌ల సంఘం అధ్యక్షులు పల్లికొండ సంతోష్‌తో పాటు జిల్లాలోని ఆయా మండలాల ఈ పంచాయతీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

రాయికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామా నికి చెందిన గుండ నాంపెల్లికి మంజూరైన రూ.12 వేల విలువ గల సీఎం ఆర్ఎఫ్ చెక్కును శనివారం గ్రామ కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాటిపెల్లి రాజశేఖర్, కాశిరెడ్డి నాగరాజు, దానవేని రాము పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రాయికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాట్లవాయి, ఆల్యా నాయక్ తండా గ్రామాల్లో శనివారం సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నరహరి, ఆర్‌పి పద్మయ్య, సీసీ సుజాత, గ్రామ సంఘం అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

● రైతులు ఆందోళన చెందవద్దు ● మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



కొనుగోలు కేంద్రంలో మొలక వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. సారంగాపూర్ మండలం బట్టపెల్లి గ్రామంలో 200 ఎకరాల్లో వరి పంటలు నేలవాలి, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం మొలకలు రావడం చూస్తుంటే తీవ్ర ఆవేదన కలుగుతోందని జీవన్‌రెడ్డి అన్నారు. ఇంతవరకు రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికా రులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్ట వివరాలను నమోదు చేయకపోవడం బాధాకర మన్నారు. అధికారుల తీరువల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. ఓవైపు ముఖ్యమంత్రి పంట నష్టం జరిగిన రైతులకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని ప్రకటన చేసిన తర్వాతనైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. బట్టపెల్లిలో గ్రామంలో పంటల నష్టంపై రైతులను ఆదుకోవాలలని అదనపు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొండ్ర రాంచందర్‌రెడ్డి, నాయకులు కొక్కు గంగారాం, చేకుట శేఖర్, కాలగిరి సత్యనారాయణరెడ్డి, బేర మహేష్, మల్యాల శ్రీనివాస్, కాలువ భూమయ్య, జెట్టి అంజి, గుర్రం రవి, పాగాని కొమురయ్య, మధు, చిరంజీవి, గట్టయ్య, మారం రవి, గాజుల శ్రీనివాస్, జెట్టి రమేష్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ ర్యాలీకి తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాల అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన దళిత ఆత్మ గౌరవ ర్యాలీకి జగిత్యాల జిల్లాకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా నుంచి పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ ర్యాలీలో ఎమ్మెస్పీ అధ్యక్షులు దూమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్‌పెల్లి లక్ష్మణ్, మోకినపల్లి సతీష్, బొల్లి అనిల్, ముప్పారపు రామ స్వామి, చెన్న కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ అడుగుజాడల్లో నడవాలి



వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అడుగుజాడల్లో యువత నడవాలని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏకతా దివస్ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. దేశభక్తిని అందరూ పెంపొందించుకోవాలని సూచించారు.

డబుల్ బెడ్‌రూం అర్హుల జాబితా

జగిత్యాల టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు డబుల్ బెడ్‌రూం అర్హుల జాబితాను జగిత్యాల మున్సిపల్ కమీషనర్ కార్యాలయంలో నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ స్పందన తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళకోసం రెండు వేలకు పైగా దరఖాస్తులు చేసుకోగా రెవెన్యూ అధికారులు విచారణ జరిపి అర్హులైన 535 మంది దరఖాస్తుదారుల జాబితాను జగిత్యాల మున్సిపల్ కార్యాలయం నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయంలో తమ వివరాలు చూసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

'సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు'

జగిత్యాల అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సేవా కార్యక్రమాలతోనే ఉత్తమ గుర్తింపు లభిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల ఐఎంఏకు రాష్ట్ర స్థాయిలో రౌండ్ బెస్ట్ బ్రాంచ్ అవార్డ్ యాక్టివిటీ రిపోర్ట్ ఆఫ్ 2024-25 సంవత్సరానికిగాను ఎంపికైంది. ఈసందర్భంగా యాక్టివిటీ రిపోర్ట్ పుస్తకావిష్కరణను శనివారం జగిత్యాల ఐఎంఏ కార్యాల యంలో చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐఎంఏ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు ద్వారాకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గురు వారెడ్డి, జగిత్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ గూడూరి హేమంత్, కార్యదర్శి డాక్టర్ అనుతేట శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ సుధీర్ కుమార్, ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతు లు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన రైతులకు సూచించారు. మార్కెటింగ్ ఆధ్వ ర్యంలో జగిత్యాల రూరల్ మండ లం లక్ష్మీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ దాదాపు పూర్తి కావచ్చిందని, నిధుల సమస్య వల్ల ఆలస్యం జరిగిందన్నారు. రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. మక్కలు మద్దతు ధర రూ.2,400 ఉందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిం చాలని రైతులకు సూచించారు. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినడం చాలా బాధాకర మన్నారు.

జగిత్యాల నియోజక వర్గంలో అత్యధిక సామర్థ్యం గోదాంల ఏర్పాటు, మార్క్‌ఫెడ్, ఎఫ్‌సీఐ, వేర్‌హౌస్ గోదాంలతో యూరి యా కొరత లేకుండా కృషి చేశానని ఎమ్మెల్యే తెలిపారు. మార్క్ ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, నక్కల రవీందర్‌రెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి, గంగన్న, జాన్, బాలముకుందం, నారాయణరెడ్డి, చంద్రరెడ్డి, రత్నా కర్‌రెడ్డి, రవి, రాజేష్, రైతులు తిరుపతిరెడ్డి, గంగన్న పాల్గొన్నారు.

జీఎం కాలనీ ఆలయంలో చోరీ

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీలోని హనుమాన్ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి అందులోని నగదు, కానుకలను ఎత్తుకెళ్లారు. ఆలయకమిటీ నిర్వాహకులు శనివారం ఉదయం విషయాన్ని గమనించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు, క్లూస్ టీమ్ ఘటన స్థలంలో పరిశీలించారు. కాగా ఆలయంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో చోరీకి సంబంధించిన ఆధారాలు లభించలేదు. గతంలో ఇదే ఆలయంలో హుండీ చోరీ జరిగింది. రెండోసారి చోరీ జరుగడంతో పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో..

ఎండపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి రేణుకఎల్లమ్మ తల్లి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగుల గొట్టి దొంగతనం చేశారు. హుండీలోని రూ.50వేల విలువైన పుస్తె, మట్టెలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని బసంత్‌నగర్ ఎస్‌ఐ శ్రీధర్, ఎండోమెంట్ అధికారులు శరత్, శ్రీనివాస్ పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి పట్టివేత

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సంజయ్‌గాంధీనగర్ వాటర్ ట్యాంకుసమీపంలో శనివారం తప్పట్ల సందీప్ అలియాస్ బబ్లూ అనేవ్యక్తి నుంచి 135 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌ఐ రమేష్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా వాటర్ ట్యాంకుగేట్ ఎదురుగా సందీప్ అనుమానాస్పదంగా తచ్చాడుతూ కనిపించాడు. అతడిని విచారణ చేయగా గంజాయి దొరికినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- గత ప్రభుత్వ హయాంలో కొంత పరిహారం, పట్టాలు పంపిణీ
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నిర్వాసితుల ఆశలు

పరిహారం కోసం నిరీక్షణ



వేములవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు నిర్వాసితులు పరిహారం కోసం పదిహేనేళ్లుగా నిరీక్షిస్తున్నారు. మధ్యమానేరు జలాశయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 11గ్రామాలు ముంపు గ్రామాలుగా ప్రకటించారు. బోయినపల్లి, వేములవాడ మండలాల్లోని ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొదురుపాక, శాభాష్‌పల్లి, చింతల ఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి, వర్దవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008లో ఆయా గ్రామాల్లో 10683 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించి గెజిట్ ప్రకటించారు. ఒక్కో కుటుంబానికి రెండు గుంటల స్థలంతో పాటుగా వృత్తి ఆధారంగా పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. నిర్వాసితులకు 2010 నుంచి పరిహారం చెల్లించడం ప్రారంభించారు. 10683 కుటుంబాలకు 10044 కుటుంబాలకు పరిహారం చెల్లించారు. మిగతా 639 కుటుంబాల్లో 219 కుటుంబాలకు చెందిన వారి సంతకాలను అధికారులు సేకరించి బడ్జెట్ కోసం రూ.20.22 కోట్లతో నివేదికను ప్రభుత్వానికి అందించారు. మిగిలిన 420 కుటుంబాల్లో కొందరు కోర్టును ఆశ్రయించగా, మరికొందరు వృత్తి మార్పులు తప్పులుగా పడటంతో పాటు వివిధ కారణాలతో పరిహారం తీసుకోలేదు. వీరి కోసం మరో రూ.30.61 కోట్లు చెల్లించాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. గత ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసి తులకు పరిహారం చెల్లిస్తూ 10 సంవత్సరాలు గడిచినా పూర్తిస్థాయిలో నిర్వాసితులకు పరిహారం అందించ డంలో నిర్లక్షంగా వ్యవహరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై గంపెడు ఆశతో ఉన్నామని నిర్వాసితులు చెబుతున్నారు.

ఇంకా అందాల్సిన పరిహారం..

మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురవుతున్న నిర్వాసిత యువతీయువకులకు ఒక కటాఫ్ డేట్‌తో ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల పరిహారం అందించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముంపు గ్రామాల్లో మొత్తం 3917మంది యువతను గుర్తించారు. అందులో యువతులు మొత్తం 2303 మందిని గుర్తించి, 1879 మందికి రూ.2లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. ఇంకా 335 మంది యువతుల వద్ద సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మిగతా 89మంది యువతుల సంతకాలు మాత్రమే సేకరించారు, వారికి ఇంకా పరిహారం చెల్లించాల్సి ఉంది. 1614 మంది యువకులను గుర్తించగా, 1537 మందికి పరిహారం చెల్లించగా, 28 మంది యువకుల సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం నివేదికను ప్రభుత్వానికి పంపించారు. మిగిలిన 49 మంది యువకులు వివిధ కారణాలతో పరిహారం తీసుకోవడం లేదు. వారికి ఇంకా చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి..

- గుండెకార్ల దేవయ్య, ఆరెపల్లి



వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామం మాది. మా ఇల్లు ముంపులో పోయింది. అధికారులు వచ్చి దరఖాస్తులు తీసుకువెళ్లారు. నాలుగు సంవత్సరాల క్రితం నోటిఫికేషన్ పూర్తి అయింది. ఇప్పటి వరకు నాకు ఇంటి పరిహారం అందలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

నిర్వాసితులపై దృష్టి సారించాలి..

- జింక శ్రీధర్, సంకెపల్లి



సంకెపల్లి గ్రామంలో గతంలో కొన్ని ఇళ్లను మాత్రమే ముంపునకు తీసుకున్నారు. తరువాత మిడ్‌మానేరు జలాశయం కెపాసిటీ పెంచిన తరువాత వాటర్ ఎఫ్‌టీఎల్‌ను దాటి రావడంతో పూర్తి ముంపు గ్రామంగా ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో పరిహారం, పట్టాలు వచ్చాయి. గ్రామంలో ఇంకా మిగిలిన 44 ఇళ్లకు పరిహారం రావాల్సి ఉంది. నోటిఫికేషన్ పూర్తి అయినప్పటికి పరిహారంలో ఆలస్యం అవుతోంది. ప్రభుత్వం త్వరగా పరిహారం అందించాలి.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 14మందికి జైలుశిక్ష

● 57 మందికి జరిమానాలు



మందు బాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

వేములవాడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 14మందికి జైలు శిక్షపడగా, 57మందికి జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 14రోజులుగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 71 మంది పట్టుబడ్డారు. వీరందరినీ వేములవాడ పోలీసులు శనివారం కోర్టులో ప్రవేశపెట్టగా 14 మందికి జైలుశిక్ష, 57 మందికి జరిమానాలు విధిస్తూ వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించారు. ఇందులో 10 మందికి రెండు రోజుల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించారు. ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. 49మందికి ఒక్కొక్కరికి రూ.1300 చొప్పున జరిమానా విధించారు. 8మందికి ఒక్కొక్కరికి రూ.2500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగిన యువకుడు

● చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్‌క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన మాదిరి సతీష్‌కుమార్(39) అనే యువకుడు మద్యం మత్తులో పురుగుల మందుతాగగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్‌కుమార్ కొంత కాలంగా మద్యంకు బానిసగామారాడు. ఈక్రమంలో అక్టోబరు 18న మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య, ఇతర కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడు సతీష్‌కుమార్ భార్య అక్షయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థల వివాదంలో తనకు అన్యాయం చేస్తున్నారని మనస్థాపం చెందిన వృద్ధురాలు ఈసరియాదవ్వ పురుగుల మందు తాగింది. ఈ సంఘటన వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వృద్ధురాలు యాదవ్వ, క్యారం మంజుల మధ్య కొంతకాలంగా స్థలవివాదం కొనసాగుతోంది. మంజుల న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలు పొందిన ఆమె స్థలంలో ఇంటి ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించింది. ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. తన స్థలంలో నిర్మాణం చేపడుతున్నారని యాదవ్వ అడ్డుతగిలింది. ఇరువర్గాల నడుమ వాగ్వావాదం చోటుచేసుకుంది. తనకు అన్యాయం చేస్తున్నారని వృద్ధురాలు యాదవ్వ పురుగుల మందుతాగింది. పోలీసులు పురుగుల మందు డబ్బాను లాక్కొని అపస్మారక స్థితిలోకి ఉన్న యాదవ్వను మొదట ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి సిరిసిల్లకు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎస్‌ఐ లక్ష్మణ్‌ను సంప్రదించగా ఇంటి స్థల విషయంలో మంజుల కోర్టు ఉత్తర్వుల ప్రకారం పనులను చేపట్టారని పేర్కొన్నారు. గొడవలు చోటు చేసుకోకుండా బందోబస్తు చర్యలు తీసుకున్నామనిచెప్పారు. వృద్ధురాలు యాదవ్వ ఆత్మహత్యకు యత్నించగా, అక్కడే ఉన్న తమ సిబ్బంది అడ్డుకుని పోలీసువాహనంలో ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

సిరిసిల్లలో ముగ్గురి అరెస్ట్

● తల్వార్‌లతో శాంతిభద్రతలకు విఘాతం



దాడులు చేసుకున్న వారిని అరెస్ట్ చేసిన పోలీసులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తల్వార్‌లతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌చేసినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు. పట్టణంలోని సుందరయ్య నగర్ సిక్‌వాడీకి చెందిన బురాని గోపాల్‌సింగ్, బురాని నర్సింహాసింగ్, రాజేష్‌సింగ్‌లు తల్వార్లు పట్టుకుని అక్టోబరు 8వ తేదీన రోడ్డుమీదికి వచ్చి భయం కరంగా అరుస్తూ వారిలోవారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారని తెలిపారు. చుట్టపక్కల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజాశాంతికి భంగం కలిగించారని, ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

స్కూటీ డిక్కీలోంచి నగదు చోరీ

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలోని వైష్ణవి బేకరీ ఎదుట పార్కింగ్‌చేసిన స్కూటీనుంచి శనివారం గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేలను ఎత్తుకెళ్లారు. ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో నర్సింగ్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్న అంజలి మున్సిపల్‌ఆఫీస్ ఎస్‌బీఐఏటీఎంలో నగదు తీసుకుని స్కూటీడిక్కీలో పెట్టుకున్నారు. మార్కండేయ కాలనీలోని బేకరీవద్దకువెళ్లి కొనుగోలు చేస్తుండగా బైక్‌పైవచ్చిన ఇద్దరు స్కూటీడిక్కీ తాళం తీసి రూ.50వేలు ఎత్తుకెళ్లారు. ఈఘటన సీసీ కెమెరాల్లో రికార్డయింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలానికిచేరుకుని విచారణ జరుపుతున్నారు. ఎస్‌బీఐ ఏటీఎంవద్దనుంచే దొంగలు అంజలిని ఫాలో అయినట్లు తెలుస్తుంది. అదనుకోసం చూసి సొమ్ముఎత్తుకెళ్లారు. సీసీఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ పట్టివేత

వేములవాడ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలో ద్విచక్రవాహనాలను దొంగిలించే యత్నంలో దొంగ గ్రామ యువకులకు దొరికాడు. శనివారం రాత్రి తిప్పాపూర్‌లో రెండు ద్విచక్రవాహనాలను దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని గ్రామ యువకులు వెంటపడి పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

●యువతికి తీవ్ర గాయాలు



బస్సు కింద ద్విచక్రవాహనం

మల్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని సాయిబాబా గుడి సమీపంలో శనివారం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పెంచాల శృతి అనే యువతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం తాటిపల్లికి చెందిన పెంచాల శృతి ద్విచక్రవాహనంపై మల్యాలలో టిఫిన్స్ తీసుకొని తిరిగి తాటిపల్లికి వెళ్తుండగా జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీబస్సు ఢీకొంది. దీంతో శృతి తలకు తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. బాధితురాలి తండ్రి పంబాల సురేశ్ ఫిర్యాదు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డీసీఎం వ్యాన్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

శంకరపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామశివారులో డీసీఎం వ్యాన్‌ను ఆర్టీసీబస్సు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ మొలంగూర్ శివారులో స్పీడ్‌బ్రేకర్ వద్ద డ్రైవర్ సడన్ బ్రేకువేశాడు. దీంతో వ్యాన్‌వెనక వస్తున్న కరీంనగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీబస్సు వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సుపాక్షింగా ధ్వంసమైంది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్ప కాలనీవద్ద జాతీయరహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడెపు జశ్వంత్‌రెడ్డి తనస్నేహితుడు సాయిచరణ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కరీంనగర్‌నుంచి సింగాపూర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో కేశవపట్నంలోని అయ్యప్పకాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో జశ్వంత్‌రెడ్డి కాలువిరగగా, తలకు బలమైన గాయమైంది. స్థానికులు అతన్ని 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుపై పడిన రేషన్ బియ్యం బస్తాలు



రోడ్డుపైన రేషన్ బియ్యం బస్తాలు

మార్కండేయకాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై బుగ్గ రైల్వేబ్రిడ్జి సమీపంలో శని వారం రేషన్‌బియ్యం బస్తా లు తరలిస్తున్న లారీ నుంచి పది బస్తాల వరకు కింద పడ్డాయి. పెద్దపల్లి ఎంఎల్‌సీ గోడౌన్‌నుంచి ఎన్‌టీపీసీ ప్రాంత రేషన్ షాపులకు వస్తున్న లారీలో బస్తాలను సరిగా లోడ్ చేయకపోవడంతో కొన్ని బస్తాలు కిందపడ్డాయి. దీంతో బియ్యం రోడ్డుపై పడ్డాయి. లారీడ్రైవర్ కొద్దిదూరం వరకు గమనించలేదు. వెనుక వస్తున్న ప్రయాణికులు లారీడ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన తిరిగి వచ్చి బస్తాలను తిరిగి లారీలో లోడ్ చేసుకున్నాడు.



స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



రాజన్న సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురిక్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. అభిషేకాది పూజలు, స్వామి వారల నిత్యకల్యాణం జరిపించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయస్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామివారలకు ఆలయ వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్యఅర్చకులు సీహెచ్ రమణాచార్య, నరసింహమూర్తి, అర్చకులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో..

వేములవాడ టౌన్: వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏఈవో శ్రవణ్ కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా సుహాసినీల ఆధ్వర్యంలో దీపాలు వెలిగించగా, ఆలయ అర్చకుల చేతుల మీదుగా వారికి వాయనం పసుపుకుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో అశోక్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్, జూనియర్ అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, సింహాచారి, ఆలయ అర్చకులు, వేదపండితులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల : కొండగట్టు అంజనేయస్వామిని శనివారం వేలాదిగాభక్తులు దర్శించుకున్నారు. కార్తీక మాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందుగల రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. రాత్రివేళల్లో దేవస్థానం తరుపున దీపోత్సవం నిర్వహించారు. కాగా శనివారం జగిత్యాల మొదటి అదనపు సెషన్స్ న్యాయమూర్తి నారాయణ అంజన్నను దర్శించుకున్నారు.

నేడు సాట్ 'క్యూ' ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్



సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం, ఉన్నత విద్య అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రతిభా పరీక్ష సాట్ క్యూ ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీలోని ఎస్సార్ ఎడ్యు సెంటర్‌లో శనివారం సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో చేరబోయే పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీ ఎస్సార్ ఎడ్యు సెంటర్ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తరగతి స్థాయిలో మ్యాథ్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ సిలబస్‌లో మొత్తం 75 ప్రశ్నలు (ప్రతి సబ్జెక్టుకు 25 చొప్పున) ఉంటాయని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు, 100 శాతం స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశంతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ప్రవేశం పొందే ఎంపీసీ స్ట్రీమ్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ (ఫోకస్ ప్రైమ్/ఫోకస్ ప్లస్/ఫోకస్/స్పార్క్/టైటన్) బైపీసీ స్ట్రీమ్ నీట్, ఎంసెట్ (ఫోకస్ ప్రైమ్/టైటన్) కోర్సులకు అర్హులని తెలిపారు. విద్యార్థులు పరీక్ష నమోదు కోసం సమీపంలోని ఎస్సార్ బ్రాంచ్‌ను లేదా 9642117378, 9154989356, 8886287456, 9154854700, 9642117330, 9642117830, 9642114698 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పతకాలు సాధించిన సైనిక్ స్కూల్ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అండర్-19 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థులు పతకాలను గెల్చుకున్నారు. 400మీటర్ల రన్నింగ్‌లో హోమ్‌రాజు గోల్డ్ మెడల్, అచల్ సిల్వర్‌మెడల్, లాంగ్‌జంప్‌లో గణేష్ గోల్డ్‌మెడల్, రన్నింగ్‌లో జె రోషన్ సిల్వర్‌మెడల్ గెల్చుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను, పీఈటీ సుమన్‌ను డైరెక్టర్ కల్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ వి లింగయ్య, ఎస్‌వీపీ శ్రీనివాస్, జేవీపీ ప్రమోద్ రాజు అభినందించారు.

కడెం ప్రాజెక్టులో దూకి ఉపాధ్యాయుడి బలవన్మరణం



రాజశేఖర్(ఫైల్)

కడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టులో దూకి ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లిజిల్లా జూలపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుంట్ల రాజశేఖర్ రెడ్డి శనివారం వివాహ విందుకు వచ్చి ప్రాజెక్టులో దూకాడు. గమనించిన ఇరిగేషన్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న కడెం ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రశాంత్ నగర్‌లో నివాసముండే ఎన్‌టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు దాసరి రాజ్‌కుమార్ (36) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజ్‌కుమార్ భార్య స్రవంతి ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తుంది. శుక్రవారం సాయంత్రం ఆమె ఇంటికి వచ్చేసరికి రాజ్‌కుమార్ అపస్మారక స్థితిలో ఉండడం, పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆమె రాజ్‌కుమార్ తండ్రి చంద్రయ్యకు ఫోన్‌చేసి తెలిపింది. రాజ్‌కుమార్‌ను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని చంద్రయ్య శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

నేడు ఐఎంఏ రాష్ట్ర సదస్సు

● ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి శ్రీధర్‌బాబు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర సదస్సును ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మెన్ డాక్టర్ పి కిషన్ తెలిపారు. శనివారం నగరంలోని ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని వీ కన్వేన్షన్‌లో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పేషంట్లకు అందించే అధునాతన వైద్యంపై సీనియర్ వైద్యులు మాట్లాడుతారని తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో పేషంట్లకు ఎలాంటి వైద్యం అందించాలనే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ఐఎంఏ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఇలాంటి సదస్సులు నేటితరం వైద్యులతో పాటు, ఇతర సీనియర్‌వైద్యులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సమావేశంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ విజేందర్‌రెడ్డి, కరీంనగర్ ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ శైలజ, కార్యదర్శి డాక్టర్ మహేశ్‌బాబు, కోశాధికారి డాక్టర్ నీలిమ, మాజీ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, డాక్టర్ వసంత్‌రావు, మాజీ కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదకొండవ రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంట రాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నది వద్ద విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు ముఖ్యఅర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



విద్యార్థులకు పొదుపు పాఠాలు

- రచ్చపల్లి పాఠశాలలో కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు
- జంక్ ఫుడ్ నిషేధంతో పొదుపు చేస్తున్న విద్యార్థులు
- లంచ్ టైంలో బ్యాంక్ నిర్వహణ

ధర్మారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో విద్యార్థులు పొదుపు పాఠాలు నేర్చుకుంటున్నారు. చిరుతిండి కోసం తెచ్చుకున్న నగదును కిడ్డీ బ్యాంక్ పేరుతో జమ చేసుకుంటూ.... లెక్కాపత్రాలు చూసుకుంటూ... ఆర్థిక పాఠాల వైపు అడుగులు వేస్తున్నారు.

ఆటాపాటలతో విద్యనందిస్తూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల గుర్తింపు తెచ్చుకొంది. పాఠశాలకు వచ్చే విద్యార్థులు రోజూ లంచ్ టైంలో బయట ఏదో ఒక చిరుతిండి కొనుగోలు చేస్తారు. అందుకు ఐదు నుంచి పది రూపాయలు ఖర్చు చేస్తారు. పాఠశాలలో జంక్ ఫుడ్ నిషేధంతో రోజు తెచ్చుకునే చిల్లర డబ్బులు ఖర్చు కాకుండా విద్యార్థులు కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేసి అందులో జమ చేసుకుంటున్నారు. ఇందుకోసం కిడ్డీ బ్యాంక్ పేరిట విద్యార్థులు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఒకరు మేనేజర్ గా వ్యవహరిస్తూ ఉండగా మరొకరు క్లర్క్‌గా ఉన్నారు. ఈ కిడ్డీ బ్యాంక్ కేవలం లంచ్ అవర్లో మాత్రమే నిర్వహిస్తారు. విద్యార్థులు తెచ్చుకున్న డబ్బులను మేనేజర్, క్లర్క్ పర్యవేక్షణలో కిడ్డీ బ్యాంక్‌లో వేసి లెడ్జర్ బుక్‌లో నమోదు చేస్తారు. జమ అయిన మొత్తం రూపాయల నుంచి వారికి అవసరం ఉన్నంతా విత్‌డ్రా చేసి చదువుకు అవసరమైన పెన్, పెన్సిల్, నోట్ బుక్స్ కొనుగోలు చేసుకుంటారు. దీంతో విద్యార్థులు చిన్న నాటి నుంచే బ్యాంక్ పని తీరు ఎలా ఉంటుందో నేర్చుకోవడమే కాకుండా, ప్రతీ రూపాయి విలువ తెలుసుకుని విద్యార్థులు భవిష్యత్ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగ పడుతుందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కిడ్డీ బ్యాంక్‌లో డబ్బులు జమ చేసుకుంటున్న విద్యార్థులు

ఆర్థిక క్రమశిక్షణ నేర్పేందుకే కిడ్డీ బ్యాంక్

- సముద్రాల వంశీ మోహనాచార్యులు (పాఠశాల ప్రధానోపాధ్యాయులు)



చాలా మంది విద్యార్థులు చిన్న నాటి నుంచే జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. అందుకే పాఠశాలలో జంక్ ఫుడ్ నిషేధం పెట్టాం. దీంతో చిరు తిండ్లు తినకుండా ఆరోగ్యం కాపాడుకుంటారు. దాంతో పాటు ఆర్థిక క్రమశిక్షణ నేర్చుకుంటారు.

పొదుపు ఎలా చేయాలో నేర్చుకున్న

- అర్జున్ తిలక్ (5వ, తరగతి విద్యార్థి)



రోజు ఇంటి నుంచి తెచ్చుకున్న డబ్బులతో ఏదో ఒకటి కొనుక్కొని తినేవాన్ని. పాఠశాలలో ఉపాధ్యాయులు జంక్ ఫుడ్‌ను నిషేధించారు. దీంతో మేమే కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేసుకొని రోజు 5, 10 రూపాయలు అందులో జమ చేసుకుంటున్నాం. ఇప్పుడు నా ఖాతాలో 150 రూపాయలు ఉన్నాయి.

విద్యార్థుల ఆర్థిక భవిష్యత్‌కు పునాది

- హరిణి (పేరెంట్)



డబ్బుల విలువ తెలిసేలా కిడ్డీ బ్యాంక్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. పిల్లలకు ఇది ఒక మంచి అలవాటుగా మారడమే కాకుండా వారి ఆర్థిక భవిష్యత్‌కు పునాది వేస్తుంది. కిడ్డీ బ్యాంక్ ఆలోచన చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

జగిత్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదనీరు రావడం శనివారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి 56,513క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16వరద గేట్లు ఎత్తి దిగువ గోదా వరిలోకి 47,059క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీకి మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా ప్రస్తుతం 4 గేట్ల నుంచి దిగువకు 8వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఎల్ఎండి పూర్తి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645 టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 7934క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 320క్యూసెక్కుల నీరు మొత్తం 8254 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్ఎండీ 4గేట్ల నుంచి 8వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 254క్యూసెక్కులు మొత్తం 8254క్యూసెక్కుల అవుట్‌ఫ్లో వెలుతోందని అధికారులు తెలిపారు.

రైతులకు తక్షణమే పరిహారం అందించాలి

● సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి



దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న పంటలకు తక్షణమే పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేకొండ తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, బ్రిడ్జిలను, రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 10వేల ఆర్థిక సాయం వెంటనే అందించాలన్నారు. మండలాల్లో యుద్ధ ప్రాతిపదికన సర్వేలు చేయాలన్నారు. అనేక గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జిలు, వ్యవసాయ బావులు దెబ్బతిన్నాయన్నారు. పశువులు మృతచెందిన సంఘటన కలిచి వేసిందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టరు చాడ శ్రీధర్‌రెడ్డి, సీపీఐ జిల్లాకౌన్సిల్ సభ్యుడు బోయినిపటేల్, ముద్రకోల రాజయ్య, పరకాల కొండయ్య, విలాసాగరం అంజయ్య, రాచర్ల రంగయ్య, బోయిని రాజు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెంచాల రవి, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాశీలో వేములవాడ రాజన్న కల్యాణం

వేములవాడటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం కాశీ పుణ్యక్షేత్రంలోని విశ్వనాథ ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీపరాశర వైదిక ఆగమ వేద శాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా వేములవాడ రాజరాజేశ్వర ఆలయ అర్చకులు నమిలికొండ ఉమేష్‌శర్మ, చంద్రగిరి శరత్‌శర్మ, నెమలికొండ రాజేశ్వరశర్మ, మామిడిపల్లి శరత్, వెంకటయ్య ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఆలయ ఈవో రమాదేవి, ఏఈఓబి శ్రీనివాస్, సూపర్డెంట్ శ్రీనివాస శర్మ, వి.భాస్కర్ పాల్గొన్నారు.



రాజన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొనుగోలు కేంద్రాలకు దొంగల బెడద

● రాత్రివేళలో చోరీకి గురవుతున్న ధాన్యం
● చోద్యం చూస్తున్న నిర్వాహకులు

మానకొండూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వరిధాన్యాన్ని తరలిస్తే కాపలాదారులు లేకపోవడంతో రాత్రి వేళలో ధాన్యం చోరీకి గురవుతోంది. దీంతో రైతులు ఎవరికి చెప్పాలో తెలియక లబోదిబోమంటున్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో లింగాపూర్, రంగపేట, పచ్చునూర్, వెల్ది, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు మహిళల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడేందుకు రాత్రివేళలో నిర్వాహకులు కాపలాదారులను నియమించాల్సి ఉంటుంది. అవేమీ పట్టించుకోకుండా నిర్వాహకులు వదిలి వెళ్లిపోతున్నారు. ఇదే అదనుగా భావించి రోడ్డుకు దగ్గరగా ఉండే కొనుగోలు కేంద్రాలను టార్గెట్ చేసిన దొంగలు రాత్రివేళలలో వాహనాల్లో ధాన్యాన్ని తరలించే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రంగపేట కొనుగోలు కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ వాహనంలో 20సంచుల్లో ధాన్యం నింపుతుండగా దారివెంబడి వెళ్లే వారు గమనించి రైతులకు సమాచారం అందించారు. రైతులు సంఘటనా స్థలానికి చేరుకొని పట్టుకునే క్రమంలో ఒకరు పారిపోగా మరొకరిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మేల్కొని కాపలాదారులను ఏర్పాటు చేసిధాన్యాన్ని కాపాడాలని రైతులు కోరుతున్నారు.



రంగపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలవాలి

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్స్ కరీంనగర్ ఉమ్మడిజిల్లా జట్లు విశేష ప్రతిభచాటి విజేతలుగా నిలవాలని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న సీనియర్స్ మహిళలు, పురుషుల ఖో-ఖో జట్ల శిక్షణశిబిరాన్ని సుడాచైర్మన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. కోచ్‌ల శిక్షణలో క్రీడాకారులు ఖో-ఖోలోని నైపుణ్యాలలో ప్రతిరోజు సాధన చేస్తున్నారన్నారు. ఈనెల7,8,9తేదీల్లో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన క్రీడాకారులతో కూడిన ఉమ్మడిజిల్లా జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు, జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు, ట్రాఫిక్ ఆర్ఐ కుమారస్వామి, రాష్ట్ర డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘ అధ్యక్షుడు డాక్టర్ సురేందర్ రెడ్డి, ఎస్సారార్ కళాశాల ఉపన్యాసకులు, జిల్లా సంఘ ప్రతినిధులు సూర్య ప్రకాశ్, డాక్టర్ ఎ రవీందర్, కట్ట సంతోష్, కరుణాకర్, అశోక్, రాములు, ఖో-ఖో కోచ్‌లు వెంకటేశ్, ఆనంద్, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



అక్షయకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఓదెల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మోడల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న కనగర్తి విద్యార్థి వేల్పుల అక్షయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాపోటీలు నిర్వహించగా జిల్లా స్థాయిలో బంగారుపతకం సాధించింది. మోడల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అక్షయ ఎంపికపై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీడీ కుమారస్వామి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు. వరంగల్ జిల్లాకేంద్రంలో రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి.

ప్రశాంతంగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు

● 44.23 శాతం పోలింగ్
● పోలైన ఓట్లు కరీంనగర్‌లో 3,342 ఓట్లు... జగిత్యాలలో 772



పోలింగ్ కేంద్రం లోపల హెల్ప్ డెస్క్ వద్ద ఓటర్ల సందడి

కరీంనగర్ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్‌బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. కరీంనగర్, జగిత్యాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా సాధారణ ఎన్నికల తరహాలో ఉదయం 7గంటల నుండే బ్యాంకుసభ్యులు (ఓటర్లు) తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా 44.23 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్, జగిత్యాలలో కలిపి 9,287 మంది ఓటర్లు ఉండగా కరీంనగర్‌లో 7,272 మంది ఓటర్లకు 3,342 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జగిత్యాలలో 2,025మంది ఓటర్లు ఉండగా 772 మంది ఓట్లు వేశారు. కరీంనగర్ ఓటర్ల కోసం ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో 24పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి ఒక్కో స్టేషన్‌లో 300మంది ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. జగిత్యాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 7 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఒక్కోస్టేషన్‌లో ఒక పీవో, ఒక ఏపీవో, ముగ్గురు సిబ్బందితోపాటు మొత్తం 150 మందిని ఎన్నికల కోసం డ్యూటీలు వేశారు. 12 డైరెక్టర్లలో ఎస్సీ, ఎస్టీకి ఒకటి, మహిళలకు రెండు, జనరల్‌కు తొమ్మిది స్థానాలను రిజర్వు చేయడంతో ఎస్సీఎస్టీల కోసం బ్ల్యూ, మహిళలకు పింక్, జనరల్‌కు వైట్ కలర్ మూడు రంగుల్లో ఉన్న బ్యాలెట్‌లో ఒక్కో ఓటరు 12ఓట్లను వినియోగించుకోవాలని, అంతకంటే ఎక్కువ ఓట్లు వేస్తే చెల్లుబాటు కావని, తక్కువ ఓట్లు వేసుకోవచ్చని ఓటర్లకు సూచించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు కరీంనగర్, జగిత్యాలలో ప్రశాంతంగా ముగిసింది. ఆ తర్వాత జగిత్యాల పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలకు పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సిబ్బందితో తరలించారు.

● నాలుగు రౌండ్లలో ఓట్ల లెక్కింపు..

5 గంటల వరకు జగిత్యాల పోలింగ్ బాక్సులు కరీంనగర్‌కు చేరుకోగానే నాలుగు టేబుళ్లపై ఒక్కో బాక్సును ఓపెన్‌చేసి మూడు రంగుల్లోని బ్యాలెట్లను వేరు చేసి 50 చొప్పున బెండళ్లు కట్టి లెక్కింపు ప్రారంభించారు. సాయంత్రం 7.30గంటలకు మహిళాడైరెక్టర్ పోస్టులకు సంబంధించిన ఓట్లను, ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ ఓట్లను ఒక్కో టేబుల్ వేసి వేర్వేరుగా లెక్కింపు ప్రారంభించగా, జనరల్ ఓట్ల కోసం రెండు టేబుళ్లను వేసి లెక్కించారు.

● నేడో, రేపో చైర్మన్ ఎన్నిక

నాలుగు రౌండ్లలో లెక్కింపు చేపడుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఫలితం తేలనున్నది. గెలుపొందిన 12 మంది డైరెక్టర్లలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆదివారం లేదా సోమవారం ఎన్నికైన డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్ ఎన్నిక నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

● జగిత్యాలలో 36 శాతం పోలింగ్..

జగిత్యాల అర్బన్: కరీంనగర్ కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ ఎన్నికలు జగిత్యాలలో శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జగిత్యాలలో 36శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఉదయం పోలింగ్ మందకొడిగాసాగింది. మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ జరగగా రెండు గంటల తర్వాత పోలింగ్ కేంద్రం గేట్‌వేశారు. ఈ ఎన్నికల్లో జగిత్యాల పట్టణంతోపాటు చుట్టుపక్కల మండలాలు గ్రామాలకు చెందిన పలువురు తమ ఓటుహక్కు వినియో గించుకున్నారు. జగిత్యాల అర్బన్‌బ్యాంక్ ఎన్నికల్లో అనేకమంది ఓట్లు గల్లంతు అయ్యాయని బీజేపీ జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల కృష్ణహరి ఆరోపించారు. బ్యాంక్‌లోని వాటాదారులు మరణిస్తేతప్ప వారిఓట్లు తొలగించకూడదని నిబంధనలు ఉన్నాయన్నారు. అలాంటప్పుడు బతికిఉన్న వారి ఓట్లు ఎందుకు తొలగించారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఓటరు లిస్టును పరిశీలించి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.



జగిత్యాలలో ఓట్లు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు



ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపుతున్న ఓటర్లు

నేలవాలిన పంటల పరిశీలన

ఎండపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండేడ, శానబండ తదితర గ్రామాల్లో శనివారం వ్యవసాయ విస్తరణ అధికారి సందీప్ రైతులతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పంటలు, నేల వారిని వాటిని గమనించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కాగా రైతులకు చెందిన సుమారు 150 నుంచి 200 ఎకరాల్లో వరి పంట దెబ్బతిని నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. ఆయనవెంట పలు గ్రామాలు రైతులు ఉన్నారు.

తుఫాన్ బాధితులకు నష్టపరిహారం అందించాలి

కొడిమ్యాల, నవంబరు1(ఆంధ్రజ్యోతి) : ఇటీవల సంబంవించిన తుఫాన్ వలన పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బండ నర్సింహరెడ్డి కోరారు. శనివారం మండల పార్టీ అధ్యక్షుని ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తహసీల్దారు కార్యాలయంలో రైతులను ఆదుకోవాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ. సింగిల్ విండోల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని కొనుగోలు వెంటనె ప్రారంభించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన సంచులను, తూకం మిషన్లను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో మండల బీజేపీ నాయకులు ఏలేటి నర్సింహరెడ్డి, సాయిబాబా, అంజి, తిరుపతి, హరీష్ అరుణ్, రాజేశ్వర్‌రెడ్డి, రమేష్, శంకర్, సుధాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

మల్యాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరలను పొందాలని మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని తాటిపల్లి, లంబాడిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వసంత, ఏపీఎం దేవరాజ్, తక్కళ్లపల్లి విండో చైర్మన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు

మెట్‌పల్లి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో కూడిన విద్యతోనే నేటి సమాజంలో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని బీజేపీ జిల్లా కార్యదర్శి పీసు రాజేందర్‌రెడ్డి అన్నారు. వివిఆర్ విజ్ఞానజ్యోతి ఇంజనీ రింగ్ కాలేజ్ హైదరాబాద్ వారు సమకుర్చిన నోటుబుక్కులను శనివారం మండలంలోని మేడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యా ర్థులకు న్యాయవాది గడ్డం ప్రశాంత్, గడ్డం దుర్గాప్రసాద్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలి, దురుల వాట్లకు లోనుకాకుండా మంచి భవిష్యత్‌ను సాధించుకోవాలన్నారు. విద్యార్థులు చదు వుతో పాటు ఇష్టమైన రంగాల్లో రాణించేం దుకు దృష్టి సారించేందుకు ఉపా. ధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు నాగమణి, శ్రీదేవి, పద్మలత, నాగన్న, జ్యోతి, భీమన్న పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం




జగిత్యాలలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, ధర్మపురిలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశ సైనికులను కించపర్చేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేశారు. ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద నిరసన తెలిపిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి విఫలయత్నం చేశారు. పోలీసులు తక్షణమే స్పందించి దిష్టిబొమ్మ లాక్కొని వెళ్లారు. సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నించిన బీజేపీ నాయకులను అరెస్టుచేసి స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కార్యక్రమంలో బీజేపీ బాధ్యులు ఆముద రాజు, సిరికోండ రాజన్న, పవన్‌సింగ్, ఇట్నేని రమేష్, జుంబర్తి దివాకర్, గడ్డల లక్ష్మీ హరికృష్ణ, కడార్ల లావణ్య, నక్కజీవన్, జున్ను సంతోష్, మర్రిపెల్లి సాగర్ పాల్గొన్నారు.

●**కోరుట్ల రూరల్:** సీఎం దిష్టిబోమ్మను శనివారం బీజేపీ శ్రేణులు దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలోని కార్గిల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న కోరుట్ల ఎస్ఐ చిరంజీవి బీజేపీ శ్రేణులను చెదరగొట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పాకిస్తాన్ భారత్‌పై దాడి చేసిన భారత్ ప్రతిస్పందించలేదని దేశ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. భారత దేశ ప్రజలకు, ఆర్మీకి, సైనికులకు వెంటను క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, ఆకుల శ్రీనివాస్, స్తంభంకాడి శ్యాంసుందర్, శ్రీనివాస్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, మాధవ్, ఒగేటి అంజయ్య, సంకు మదుసూధన్, శివసాయి, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్:** సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను రాయికల్ మండల బీజేపీ నాయకులు శనివారం దహనం చేశారు. రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, మండల ప్రధాన కార్యదర్శులు రవీందర్ రెడ్డి, కునారపు భూమేష్, ఉపాధ్యక్షుడు వట్టిమల్ల శ్రీనివాస్, సంకోజి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, దిండిగాల రాజేష్, కంటె భూమేష్, సామల్ల సతీష్, మహేష్, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

●**మల్యాల:** ఆపరేషన్ సింధూర్‌పై సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికాదంటూ మల్యాలలో బీజేపీ నాయకులు ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. మల్లేశం, గంగారాం, పరమేశ్, గౌతం, ఆనందం పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి దేశ సమగ్రతకు బంగం కలిగెలా పాకిస్తాన్‌కు అనుకూలమయ్యే విదంగా వివాదస్పద వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ శనివారం రాత్రి మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మండల బీజేపీ నాయకులు బండ నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో సీఎం దిష్టి బొమ్మను దగ్దం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు ఏలేటి నర్సింహరెడ్డి, అంజి, అఖిల్, నరేష్, మహేష్, రమేష్, అనిల్ తదితరులు ఉన్నారు.

'మహిళా సంఘాల అభివృద్ధికి కృషి'



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో సునీత

కొడిమ్యాల, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని అడిషనల్ డీఆర్డీవో సునీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీదుర్గ సమాఖ్య కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించు సమావేశం ప్రారంభించారు. ఈసందర్భంగా అడిషనల్ డీఆర్డీవో మాట్లాడుతూ అర్హులైన మహిళా సంఘాలను, దివ్యాంగులను, కిశోర బాలికల, వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేయటానికి కృషి చేయాలన్నారు. సంఘాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ప్రభుత్వం ముందుకు వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం ద్యావ మల్లేశం, సంఘం అధ్యక్షురాలు పద్మ, సీసీలు శ్రీనివాస్, వీరకుమార్, మరియా, కమలకుమారి, స్వరూప సిబ్బంది సుకన్య, వివిధ గ్రామాల అధ్యక్షులు, సెర్ప్ సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

●జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అంగన్‌వాడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ హౌసింగ్ కళాశాలలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్దుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలో చదివే పిల్లలకు మంచి దుస్తులు, పోషకాహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని అతిపెద్ద డబుల్ బెడ్ రూం కాలనీగా అర్బన్ కాలనీ రూపుదిద్దుకుందన్నారు. అర్బన్ హౌసింగ్ కాలనీని జగిత్యాల పట్టణంలో కలపడం జరిగి, గెజిట్ కూడా రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజుగౌడ్, డీడబ్ల్యూవో డా.భోనగిరి నరేష్, సీడీపీవో మమత, మున్సిపల్ మాజీ చైర్మెన్‌లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి లక్ష్మణ్, నాయకులు సుధాకర్, దుమాల రాజ్‌కుమార్, శ్రీనివాస్, కోరెపు గంగమల్లు, క్యాదాసు నవీన్, పోతునక మహేష్, పవన్ తదితరులున్నారు.

ఆటోస్టాండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్ హౌసింగ్ కాలనీలో ఆటోస్టాండ్ అడ్డాను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆటో కార్మికులకు అన్ని విధాల అండగా ఉంటామని, అర్బన్ హౌజింగ్ కాలనీలో ఆటో స్టాండ్, బస్టాండ్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలున్నారు.

తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముందస్తు షుగర్ వ్యాధి నిర్ధారణతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపెల్లి రంజిత్ అన్నారు. రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మందికి ఉచితంగా షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బెక్కెం తిరుపతి, డీసీ బత్తిని భూమయ్య, మ్యాకల రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, కొయ్యడి మహిపాల్, వాసం ప్రసాద్, కాటిపెల్లి రాంరెడ్డి, కట్కం కళ్యాణ్, బొమ్మకంటి నవీన్, పారిపెల్లి శ్రీనివాస్, సాంబారు శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియను మోసారపు సంతోష్, ప్రణయ్, వాసం గోవర్ధన్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

భీమారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిర్ఫ్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి అన్నారు. భీమారం మండలంలోని రాగోజీపేట గ్రామంలో శనివారం జిర్ఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు ప్రశాంత్ కుమార్ 150 మందికి బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 130 మందికి డాక్టర్ చెక్కపెల్లి రాజశేఖర్ దంత వైద్య సేవలు అందించి ఉచితంగా పేస్టులు, మందులు అందించారు. డాక్టర్ దురుశెట్టి శ్రీకాంత్ సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి పూర్ణిమ, నాయకులు లహరికమారుతి, బండెల గంగాధర్, వెంకట చారి, సుమలత, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వశక్తి మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

మల్యాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నిరక్ష్యరాస్యులైన ప్రతీ స్వశక్తి మహిళను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని మండల విద్యాధికారి ఎస్.జచసింహరావు అన్నారు. మల్యాలలోని సెర్ప్ కార్యాలయంలో శనివారం వయోజన విద్య అమలుపై గ్రామ మహిళ సమాఖ్యలు, వీవోఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవరాజ్, సీసీలు కృష్ణమోహన్, మల్లేశం, గంగరాజం, అశోక్, సిబ్బంది గుర్రం లక్ష్మినారాయణ, సరిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే కూరగాయల విక్రయం

-ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం -ఇబ్బందులు పడుతున్న ప్రజలు -రైతు బజార్‌లోకి తరలించాలని ప్రజల వినతి



రోడ్డుపై కూరగాయల విక్రయాలతో ఏర్పడిన ట్రాఫిక్ జామ్

జగిత్యాల టౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌లో రైతు బజార్ ఉండగా రోడ్డుపైనే కూరగాయాల విక్రయాలు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ వెళ్ళేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల పట్టణంలో టవర్ సర్కిల్ వద్ద ప్రధాన కూరగాయల మార్కెట్ ఉండగా కరోనా సమయంలో సామాజిక దూరం పాటించాలని కూరగాయల మార్కెట్‌ను పట్టణంలోని పలు ప్రాంతాలకు విస్తరించారు. అందులో భాగంగా అంగడి బజార్, వాణినగర్‌రోడ్, మినీ స్టేడియంలో తాత్కా లికంగా విక్రయాలు చేపట్టారు. తర్వాత మినీ స్టేడియంలోని మార్కెట్‌ను పక్కనే రూ.50 లక్షలతో నిర్మించి రైతు బజార్‌లోకి మార్చారు. రైతులు, విక్రేతలు, హోల్‌సెల్ విక్రయదారులు, కొద్ది రోజులు రైతు బజార్‌లోనే విక్రయాలు కొనసాగించారు. తర్వాత రైతు బజార్‌లో ఉన్న కూరగాయల విక్రయాలు నడిరోడ్డు పైకి వచ్చాయి. అయితే ఆ రోడ్డులోనే చాలా ఆసుపత్రులు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో రోగులను అంబులెన్స్‌లో కరీంనగర్, హైదరాబాద్ తరలిస్తుంటారు. అయితే రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు కొనసాగించడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వ్యాపారులను రైతు బజార్‌లోకి తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

-జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశం



రోడ్డుపై కూరగాల విక్రయాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మున్సిపల్ అధికారులు చొరవచూపి కూరగాయల వ్యాపారులను రైతు బజార్‌లోకి మార్చాలి. ప్రస్తుతం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఇద్దరు కానిస్టేబుళ్లు షిఫ్టల వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. రద్దీ సమయాల్లో ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నాం.

వరి పంట పరిశీలన

మల్యాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లిలో కోతకు వచ్చిన వరి పంటను శాస్త్రవేత్తలు సుమలత, స్వాతి, స్పందనబట్, స్వాతి సందర్శించారు. నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా జేజీఎల్ 24423 రకం వంగడం అందించగా ప్రస్తుతం పంట కోతకు రావడంతో శాస్త్రవేత్తలు పరిశీలించారు. చీడపీడల బెడద లేకుండా అధిక దిగుబడి వచ్చిందని ఈ సందర్భంగా అన్నారు. తేమ 12శాతం వచ్చె వరకు ఎండబెట్టుకోని మరలా యాసంగి కాలంనకు విత్తనంగా రైతులు వాడుకో వచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.చంద్ర దీపక్, ఏఈవో శ్రీనివాస్ రైతులు జలంధర్, రాజలింగం పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



న్యాయవాదులతో సమావేశం నిర్వహిస్తున్న జడ్జి జానకి

ధర్మపురి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వి నియోగం చేసుకోవాలని ధర్మపురి జూని యర్ సివిల్ కోర్టు జడ్జి యేగి జానకి అన్నారు. ధర్మపురి పట్టణంలోని కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి జానకి మాట్లాడుతూ రాజీమార్గమే రాజ మార్గమని, ఈ నెల 15 న శనివారం స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సివిల్ కేసులు, వివాహ సంబంధిత కేసులు, మోటార్ ప్రమాద క్లైములు, చెక్ బౌన్స్ కేసులు, ఇతర రాజీ పడదగిన క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దుమ్మెన శ్రీనివాస్, రౌతు రాజేష్, జాజాల రమేష్, కలమడుగు కీర్తి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామాలకు మోక్షం

(ఐదో పేజీ తరువాయి)

కోర్టును ఆశ్రయించడంతో జీవోను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి 2020కి ముందు సాదా బైనామాలకు దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా మధ్యంతర ఉత్త ర్వులను హైకోర్టు రద్దు చేయడంతో లైన్ క్లియర్ అయింది. ఆ వెంటనే సాదాబైనామాలకు పరిష్కా రాలు చూపాలని ప్రభుత్వం అన్ని జిల్లాల అధికారు లకు ఉత్తర్వులు జారీ చేసింది.

భూ భారతిలో ప్రతిపాదన..

కాంగ్రెస్ ప్రభుత్వం దరణి స్థానంలో భూ భారతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడంతో పాటు రెవెన్యూ చట్టం 2024ను ప్రతిపాదించింది. దీనిలో సాదా బైనామాలకు చట్టబద్ధత కల్పించే అంశం చేర్చడంతో గతంలో సాదాబైనామాలకు పట్టాలు జారీ చేయాలని దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశలు చిగురిస్తున్నా యి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ధరలు అధికంగా ఉండటంతో చిన్న, సన్న కారు రైతులు సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించే ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నారు. 2019 నుంచి వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్‌లు రెవెన్యూ కార్యాలయాల్లో సాగుతుండగా అంతకు ముందు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటికి రెవెన్యూ అధికారులు మ్యుటేషన్ చేసి పట్టాలను జారీ చేసేవారు. ఈ తంతు వల్ల వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన వారికి పట్టాల జారీలో తీవ్ర జాప్యం ఏర్పడేది. కొత్త రెవెన్యూ చట్టం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలకు మోక్షం కల్పించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మొర ఆలకించి కొత్త చట్టం ద్వారా సాదా బైనామాలకు పట్టాలను జారీ చేసే విషయాన్ని తెరపైకి తీసుకొని రావడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మల్యాల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తూకం వేయకపోవడంతో రైతులు అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నారని వెంటనే కొనుగోల్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మల్యాల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాలతో తడిచిన ధాన్యంను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, ప్రసాద్, రవి, గంగాధర్, రాజు, లత, రమ, గౌతం, పొన్నం సాయి, మహిపాల్‌రెడ్డి, రమేశ్, కిషన్, గంగారాం, మౌర్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందజేస్తున్న మద్ధతు ధర పొందాలని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని మేడిపల్లి, సత్తక్కపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ నీతతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కేంద్రంలోని రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని ధాన్యం కుప్పలు వద్దకు వెళ్లి మ్యాచర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ రైతును రాజు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఆర్ఐ కాంతయ్య, ఐకేపీ ఏపీఎమ్ అశోక్, సీసీలు వెంకటరమణయ్య, సూరయ్య, వీవోఏలు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** రైతాంగ ప్రయోజనాల కోసమే గ్రామ గ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పెగడపల్లి మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాములపల్లి, రాజారాంపల్లి, నామాపూర్, ల్యాగలమర్రి, అయిత్‌పల్లి , నామాపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాములు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ రాములు గౌడ్ మాట్లాడుతూ కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా వరుస క్రమంలో ధాన్యం తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రవివర్మ, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, నాయకులు ఒరుగల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, తిరుపతి, మల్లారెడ్డి, భాస్కర్, కొమురయ్య, అంజయ్య, ఐకెపి సీసీలు తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల రూరల్:** కొనుగోలు కేంద్రాలలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకోని దాన్యం కొనుగోలు చేపట్టాలని సింగిల్ విండో చైర్మెన్ నర్సరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎఖీన్‌పూర్ సింగిల్ విండో పరిధిలోని నాగులపేట, సంగెం, ఎఖీన్‌పూర్ గ్రామాలలో దాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ అధికారిణి నాగమణి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కాశిరెడ్డి మోహన్ రెడ్డితో కలిసి చైర్మెన్ నర్సరెడ్డి ప్రారంభించారు. తడిచిన దాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలక వర్గ సభ్యులు మ్యాదిరి రాజం, ఎర్ర బాగ్య, పుటుకపు నర్సరెడ్డి, వరికంటి సాగర్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో నిలిచిన మధ్యాహ్న భోజనం

ఇబ్రహీంపట్నం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్షకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం శనివారం నిలిచిపోయింది. వంట సరిగా చేయడం లేదని, రాజీనామా చేయాలని ప్రధానోపాధ్యాయుడు కొన్ని రోజులుగా ఒత్తిడి తెచ్చి రాజీనామా లేఖ తానే రాసి సంతకం తీసుకున్నాడని ఏజెన్సీ నిర్వాహకురాలు నారె చిన్ను ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పాఠశాలలో మధ్యాహ్నం 12 గంటలైనా విద్యార్థులకు భోజనం తయారు చేయకపోవడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ వరప్రసాద్ పాఠశాలకు చేరుకుని హుటాహుటిన విద్యార్థులకు భోజనాన్ని తయారు చేయించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను పిలిచి ఏజెన్సీ నిర్వాహకులు గురించి వాకబు చేశారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు రాజేందర్‌ను వివరణ కోరగా ఏజెన్సీ నిర్వాహకులే తమకు బిల్లులు సక్రమంగా రావడం లేదని, తమ వయసు కూడా సహకరించడం లేదని తెలుపుతూ రాజీనామా చేశారని, వారి రాజీనామాను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు తెలిపారు. ఈ విషయంపై సోమవారం విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ వరప్రసాద్ తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు

కోరుట్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులోని గుట్టపై ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయంలో అభిషేక, అర్చన, విశేష అలంకరణ, పుణ్యావచన కార్యక్రమాలను నిర్వహించారు.

స్వామి ఉత్సవ మూర్తులను గ్రామంలోని హనుమాన్ దేవాయం నుండి ప్రత్యేకంగా అలంకరించి బాజా భజంత్రీల మధ్య ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని జరపగా గ్రామంలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. దేవాలయ బ్రహోత్సవాలతో గ్రామంలో పండగ వాతవరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు, దేవాలయ శాఖ అధికారులు పాల్గొన్నారు.